క్లుప్తంగా

స్కూల్ బ్యాగుల పంపిణీ



స్కూల్ బ్యాగులు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నిడమనూరు : మండలంలోని నారమ్మగూడెం జెడ్పీ పాఠశాలలో 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం కేసీఆర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి స్టడీ మెటీరియల్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల చిన్నారులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కే.బాబు, ఉపాధ్యాయులు శ్రీను, అరుణ, జానకిరామ్, వైస్ఎంపీపీ బైరెడ్డి వెంకటరెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, రుక్కమ్మ, సుమన్, రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

లహరిరెడ్డికి నివాళి



లహరిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, తదితరులు

నిడమనూరు : మండలంలోని తుమ్మడం గ్రామానికి చెందిన యడవెల్లి లహరిరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఆమె దశదిన కార్యక్రమాన్ని మంగళవారం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటం నివాళులర్పించారు. వారి వెంట సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే ఎన్.భాస్కర్‌రావు, కుందూరు రఘువీర్‌రెడ్డి, కుందూరు జయ్‌వీర్‌రెడ్డి, బీఎల్ఆర్, కేసీఆర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, మేరెడ్డి వెంకట్రాహుల్ ఉన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం

త్రిపురారం : బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కొత్త హామీలతో తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని బీజేవైఎం మండల మాజీ అధ్యక్షుడు పాపుగోటి హరీష్ అన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ నెరవేర్చలేదని, అందుకు నిరసనగా మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమర్థపు నర్సింహ, కోప్పు సోమయ్య, రమేష్, మహేష్, శ్రీనివాస్, హుస్సేన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ

పెద్దవూర : మండలంలోని శిర్సనగండ్ల సర్పంచ్ దోరెపల్లి అంజయ్య మాతృమూర్తి దోరెపల్లి వెంకమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్‌యాదవ్, తిరుమలగిరి ఎంపీపీ భగవాన్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, రవినాయక్, మల్లారెడ్డి ఉన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి(57) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో మంగళవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు అతడి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, నాయకులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సిద్ధార్థ, సంజీవరెడ్డి, స్థానిక సర్పంచ్ యాదమ్మ, శ్రీనివాస్, లింగయ్య, ఉపేందర్‌రెడ్డి తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కొండమల్లేపల్లి : సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 1న నిర్వహించనున్న 'మార్పు కోసం మహా ఉద్యమం' బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ సేవా జిల్లా ఇన్‌చార్జ్ కొత్త అఖిల్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెరికేటి ఆకాశ్, చిలువేరు మానస పాల్గొన్నారు.

పత్తి పంటల పరిశీలన

అడవిదేవులపల్లి : మండలంలోని కొత్తనందికొండ గ్రామంలో మంగళవారం మిర్యాలగూడ ఏడీఏ పోరెడ్డి నాగమణి పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పత్తి పంటలో అంతర్ కృషి చేసి కలుపు మొక్కలను తొలగించుకోవాలని, మొదటి దశ ఎరువులను మంచి పదునుతో వేకోవాలని రైతులకు సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ శాఖ అధికారిని జి. అర్చన, రైతులు స్వామి, జైరాం, రంగ తదితరులున్నారు.

ఆరోగ్యంపై అవగాహన

మిర్యాలగూడ : బ్రహ్మకుమారీస్ మిర్యాలగూడ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు రాజయోగిని బీకే.శకుంతల శారీరక, మానసిక ఆరోగ్యం, చైతన్యం, ఏకాగ్రతపై యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజయోగిని బికే.శివలీల, ఎంఈఓ బాలాజీనాయక్, డాక్టర్ బసనపున్నారావు, మహేష్, హర్ష, నరేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, యువత పాల్గొన్నారు.

గిరిజనుల్లో 'పోడు పట్టాల' సంబరం

- 701మంది రైతులకు 1020ఎకరాలకు పట్టాల పంపిణీ
- పలు కారణాలతో 233మందికి నిలిచిన పట్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజన రైతులు



పోడు భూముల పట్టాలతో గిరిజన రైతులు (ఫైల్)

తిరుమలగిరి (నాగార్జునసాగర్) : ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోడు రైతుల కళ సాకారమైంది. పోడు భూములు సాగుచేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయడంతో గిరిజను హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పోడు రైతులకు పట్టాలు అందించారు. ఆ తరువాత పోడు రైతులకు పట్టాలు అందలేదు. దీంతో పట్టాల కోసం గిరిజన రైతులు, గిరిజనేతర రైతులు ఏళ్లుగా ఎదురుచూశారు. ప్రభుత్వం ఇప్పుడు పట్టాలు పంపిణీ చేయడంతో గిరిజన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హాలియా సభలో హామీ..

మండల వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లోని రైతులతో పాటు గిరిజనేతర రైతులు పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2005లోపు పోడు సాగుచేసుకొని వాటిపైనే ఆధారపడి వ్యవసాయాన్ని సాగిస్తున్నారు. ఇలా పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు భూమి హక్కు పత్రాలు కల్పిస్తామని సీఎం కేసీఆర్ నాగార్జునసాగర్ ఉప ఎన్నిక సందర్భంగా హాలియాలో నిర్వహించిన బహిరంగ సభలో హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో భూములు సాగుచేసుకుంటున్న రైతులు హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం 2021 నవంబర్‌లో సూచించింది. దీంతో మండల వ్యాప్తంగా 4,849 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో గిరిజన రైతులతో పాటు గిరిజనేతర రైతులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో అత్యధిక దరఖాస్తులు వచ్చిన మండలం కూడా ఇదే. దీంతో పోడు భూముల్లో సర్వేలు పూర్తి చేసి 2022 నవంబర్‌లో గ్రామసభలు నిర్వహించి మండల వ్యాప్తంగా 4,849 దరఖాస్తులకు గాను 934మంది లబ్ధిదారుల దరఖాస్తులకు ఆమోదం తెలిపింది. వాటిని డీఎల్‌సీ కమిటీకి పంపారు. అక్కడ నుంచి ఉన్నతాధికారులకు పంపగా 934 దరఖాస్తుల్లో 701మందికి 1020ఎకరాలకు స్థానిక ఎమ్మెల్యే భగత్ పట్టాలు పంపిణీ చేశారు.

నిలిచిన 233మంది పట్టాలు..

934మంది దరఖాస్తులకు గాను 701మందికి మాత్రమే పట్టాలు పొందారు. మండలంలో ఇంకా 233 మందికి రావాల్సి ఉంది. పలు కారణాలతో అవి ఆర్డీఓ కార్యాలయంలో నిలిచిపోయాని అధికారులు పేర్కొంటున్నారు. వాటిని సబ్‌డివిజన్ లెవల్ కమిటీ పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

మూడు ఎకరాలకు పట్టా వచ్చింది



మేము ఎన్నో ఏళ్ల నుంచి పోడు భూములను సాగు చేసుకుంటున్నాం. కానీ వాటికి పట్టాలు లేవు. దీంతో ఫారెస్ట్ అధికారులు ప్రతి సారీ ఇబ్బందులకు గురిచేసేవారు. దీంతో చాలా ఇబ్బందులు పడ్డాం. పలు సందర్భాల్లో వేసిన పంటలను కూడా పాడుచేసేవారు. సీఎం కేసీఆర్ ఈ సమస్యలకు పరిష్కారం చూపి మాకు పోడు భూములకు పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– రమావత్ నెహ్రూ, పోడు రైతు, ఎర్రచెరువుతండా

ఇబ్బందులు తొలిగిపోయాయి



కొన్ని సంవత్సరాల క్రితం పోడు భూములను కొట్టుకొని సేద్యం చేసుకుంటున్నాం. కానీ వాటికి పట్టాలు లేకపోవడంతో అధికారుల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయడంతో 3ఎకరాల 31గుంటలకు పట్టాపుస్తకం వచ్చింది. ఎన్నో ఏళ్లగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలిగిపోవడంతో సంతోషంగా ఉంది.

– రమావత్ లక్ష్మి, పోడు రైతు, సుంకిశాలతండా

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కొండమల్లేపల్లిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు



తిరుమలగిరిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

మిర్యాలగూడ : రాష్ట్రంలోని వీఆర్ఏలను క్రమబద్ధీకరించడం పట్ల దామరచర్ల మండల కేంద్రంలో మంగళవారం మండల వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎండీ.యూసుఫ్, ఎంపీటీసీలు సోము సైదిరెడ్డి, బాల లక్ష్మీసత్యనారాయణ, కామేపల్లి అనంతలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎస్‌కె.నాగుల్‌మీరా, సోమయ్య, గోపి, రఫి, లాల్‌అహ్మద్, శ్రీను, సైదయ్య, లక్ష్మారెడ్డి, అఫ్రోజ్, శివ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : వీఆర్ఓలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల వీఆర్ఏలు మంగళవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రవి, వెంకటేశ్వర్లు, శైలజ పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఆయా శాఖల్లో సర్దుబాటు చేసినందుకు గాను మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు సుదీర్ఘకాలానికి తగిన న్యాయం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు దుర్గాప్రసాద్, భవానీ, నర్సయ్య, బాలాజీ, నర్సింహ, మౌలీ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులకు రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

పెద్దవూర : రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న ముదిరాజ్‌లకు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని టీఆర్ఎంఎస్ మండల అధ్యక్షుడు ఈద వెంకటేష్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జోగు రమేష్‌ముదిరాజ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ముదిరాజ్‌లకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించలేదన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తగిన సీట్లు కేటాయించకుంటే, అన్ని ఎమ్మెల్యే సీట్లలో ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, శ్రీను, నాగయ్య, రామకృష్ణ, వెంకన్న, చిన్ని, రామకృష్ణ, కోటేష్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



అడవిదేవులపల్లి : విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ : రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్ అన్నారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సంఘర్షణ సైకిల్‌యాత్ర మంగళవారం దామరచర్ల మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర వసతిగృహాన్ని సందర్శించి మాట్లాడారు. బాలుర వసతిగృహానికి సొంత భవనం నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనునాయక్, కుర్ర సైదానాయక్, బూడిద వెంకటేష్, రమేష్, లక్ష్మణ్, జగన్, వీరన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

అడవిదేవులపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కస్తూరిబా గాంధీ విద్యాలయం నూతన భవనాన్ని త్వరగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల జిల్లా అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కుర్ర సైదానాయక్, లక్ష్మణ్, రమేష్, శివ, శ్రవణ్, మహేష్, జగన్ పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలి



మిర్యాలగూడ : ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు



దేవరకొండ : ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

మిర్యాలగూడ : మణిపూర్ రాష్ట్రంలో కొన్ని నెలలుగా హింస జరుగుతున్నా అరికట్టలేని ఆ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం ఉండడంతో హింసను అరికట్టకుండా కేంద్రం చోద్యం చూస్తుందన్నారు. హింసను అరికట్టేందుకు అక్కడి ప్రతినిధి బృందం ఢిల్లీకి వచ్చినా ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని మోదీ నిర్లక్ష్యంతోనే మణిపూర్‌లో ఈ హింసాకాండ చోటు చేసుకుందని ఆరోపించారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని ఈ దుర్ఘటనలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు నూకల జగదీశ్చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, పరుశురాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, వరలక్ష్మి, సైదులు, అంజాద్, దేశిరాం నాయక్, శ్రీను, నాయుడు, వెంకటేశ్వర్లు, లింగానాయక్, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

దేవరకొండ : మణిపూర్‌లో హింసకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న అఘాయిత్యాలకు నిరసనగా పట్టణంలో సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారిపై ధర్నాకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరుగుతున్న హింసకు ఆ రాష్ట్ర సీఎం, దేశ ప్రధానిలే కారణమని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను అణిచివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు పల్లా దేవేందర్‌రెడ్డి, పల్లె నర్సింహ, వెంకటయ్య, కేశవరెడ్డి, కనకాచారి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



మిర్యాలగూడ : దామరచర్లలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ : మణిపూర్‌లో జరుగుతున్న హింసకు నిరసనగా దామరచర్ల మండల కేంద్రంలో మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌లో జరుగుతున్న హింసను అరికట్టకుండా చోద్యం చూస్తుందన్నారు. ఇప్పటికైనా మణిపూర్‌లో జరుగుతున్న హింసను అరికట్టి అక్కడ శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాపానాయక్, దయానంద్, ఖాజామోహిదిన్, శ్రీను, హనుమంతు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను క్రమబద్ధీకరించి న్యాయం జరిగేలా చూడాలి



మాజీ మంత్రి జానారెడ్డిని కలిసి సమస్యను వివరిస్తున్న బాధితులు

హాలియా : పట్టణంలోని ప్రభుత్వ స్థలంలో ఇళ్లను నిర్మించుకున్న కుటుంబాలకు ప్రభుత్వం తీసుకవచ్చిన జీఓ నంబర్ 58, 59 ప్రకారం ఇళ్లను క్రమబద్ధీకరించి న్యాయం జరిగేలా చూడాలని పట్టణంలోని షిర్డీసాయినగర్, గంగారెడ్డి కాలనీవాసులు మంగళవారం స్థానికంగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2015లో ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న 122మంది బాధిత కుటుంబాలు తమకు ఇళ్ల పట్టాలు అందజేయాలని గతంలోనే దరఖాస్తు చేసుకున్నామని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా డీడీల ద్వారా డబ్బులు చెల్లించి దరఖాస్తులను మండల తహసీల్దార్ కార్యాలయంలో అందజేసినట్లు వారు మాజీ మంత్రి జానారెడ్డికి వివరించారు. కాగా ఇటీవల రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు విచారణ పేరుతో దరఖాస్తు చేసుకున్న 122మంది లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్ చూపించడం లేదని అంటున్నారని, తమ ఇళ్లను క్రమబద్ధీకరించి న్యాయం జరిగేలా చూడాలని జానారెడ్డిని వేడుకున్నారు. అందుకు స్పందించిన జానారెడ్డి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చింతల చంద్రారెడ్డి బాధితులు తదితరులు ఉన్నారు.

పోడు పట్టాలు అందించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : మండలంలోని అన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని గడ్డగుండుతండాలో పోడు భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులందరికీ పోడు పట్టాలు అందించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పట్టణానికి వచ్చిన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రైతులు 20సంవత్సరాల నుంచి సేద్యం చేసుకుంటున్నప్పటికీ పోడు హక్కు పత్రాలు దక్కలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హక్కు పత్రాలు అందించాలని ఆయన కోరారు. ఆయన వెంట వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, అప్పారావు, విజయ్, బాలునాయక్, రైతులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ



మొక్కలు పంపిణీ చేస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి

హాలియా : మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని శ్రీనాథపురం గ్రామంలో పలువురికి పండ్ల మొక్కలు, జ్యూట్ బ్యాగులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచ్‌లు విజయ్‌కుమార్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కేతావత్ జ్యోతి రామకృష్ణ, ఉప సర్పంచ్ జబీన్ జలీల్‌పాషా, తిరుమలనాథ చైర్మన్ బుర్రి రాంరెడ్డి, నాయకులు నాగేండ్ల కృష్ణారెడ్డి, నరేష్ నాయక్, పల్‌రెడ్డి లక్ష్మారెడ్డి, జయంత్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, ముస్తాఫా, ప్రసాద్, బ్రహ్మం, లింగస్వామి, కోటేష్, రమేష్ చారి, నాగార్జున్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హాలియా : ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు, ప్రశిక్షణ ప్రముఖ్ గుర్రం ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయ కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ ఉద్యమ కార్యచరణ కమిటీ నాయకులు తహసీల్దార్ మంగకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు రెండో పీఆర్సీని ప్రకటించాలని, జూలై 1నుంచి మధ్యంత భృతి విడుదల చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుర్రం సత్యనారాయణరెడ్డి, రేపాల అశోక్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే టికెట్ ఇస్తే సాగర్‌కు పూర్వ వైభవం తీసుకొస్తా



మాట్లాడుతున్న కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే గెలిచి నాగార్జునసాగర్‌కు పూర్వ వైభవం తీసుకొస్తానని కేసీఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగార్జునసాగర్‌లోని విజయవిహార్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగర్‌లో గతంలో సినిమా షూటింగ్‌లు జరిగేవని, పార్కులు పచ్చదనంతో ఉండేవన్నారు. కాలనీల్లో అంతర్గత రోడ్లు కొన్ని వేసినప్పటికీ పైలాన్ కాలనీలో శంకుస్థాపన శిలాఫలకం నుంచి బైపాస్‌రోడ్డు వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. హిల్‌కాలనీలో ప్రాజెక్టు హౌజ్ పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, దానిని పర్యాటకులకు అందుబాటులోకి తేవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎంతో ఖరీదైన విజయ విహార్ గదుల్లో పేద పర్యాటకులు రాత్రి బస చేయలేరని, గ్రామీణప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అందుబాటులో గదులు ఉండేలా చర్యలు తీసుకోవాలని టీఎస్‌టీడీసీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్‌ను కోరినట్లు తెలిపారు. తనకు ఏపదవి ఇచ్చినా అభివృద్ధి చేయడంలో మొదటి ప్రాధాన్యం నాగార్జునసాగర్‌కే ఇస్తానని అన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలి



తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పారదర్శకంగా రూపొందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన తిరుమలగిరి సాగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని పోలింగ్ బూతులను సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ పాండునాయక్, డీటీ మల్లికార్జున్, ఏఎస్ఓ రవి, బీఎల్ఓలు ఉన్నారు.

గోదాము పరిశీలన

మిర్యాలగూడ : కస్టం మిల్లింగ్ రైస్‌ను దిగుమతి చేసుకునేందుకు మిర్యాలగూడ పట్టణ శివారులో ఉన్న ఆర్ఎస్ గోదామును డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావుతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. గోదాంలో ఖాళీ స్థలం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కస్టం మిల్లింగ్ బియ్యం దిగుమతికి అన్ని అనుమతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీటీ సీఎస్ జావేద్, ఆర్ఐ సురేందర్‌సింగ్, మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటరమణచౌదరి, గుడిపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన బీసీలకు సీట్లు కేటాయించాలి

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణలోని బీసీలకు అన్నీ రాజకీయ పార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కూడా అగ్రకులాల వారికే సీటు కేటాయించారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు సీట్లను కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుణగంటి వెంకన్నగౌడ్, నాయకులు సైదులు, శివ, శ్రీకాంత్, ప్రవీణ్ ఉన్నారు.

అంగన్‌వాడీలో సీమంతాలు



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

అడవిదేవులపల్లి : పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు మొల్కచర్ల, బాలాజీతండా, నల్లమిట్టతండా కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.రమాదేవి, ఎం.రాణి, ఎస్.శ్రీదేవి, జ్యోతి, గర్భిణులు, బాలింతలు, తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

దేవరకొండ : దేవరకొండ ఆర్టీసీ డిపో కార్యాలయంలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డిపో పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు 99592 26311 ద్వారా అందించాలని ఆయన కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఖాజా అస్గర్‌అలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలతో రావాలని సూచించారు.

వేతనాలు అందించాలని వినతి

మిర్యాలగూడ అర్బన్ : మిషన్‌భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు 4నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వేతనాలు అందించాలని ఆ యూనియన్ అధ్యక్షుడు ధనావత్ వేణునాయక్ కోరారు. మంగళవారం పట్టణంలోని అవంతీపురంలో సంబంధిత ఏఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సందీప్‌రెడ్డి, భాష, సాయి, రవి తదితరులున్నారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

దేవరకొండ : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసినా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చొల్లేటి భాస్కరాచారి, పున్న శ్రీను, రాచమళ్ల నాగయ్య, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జాతీయ యూత్ కన్వెన్షన్‌కు గౌతమిరాంసింగ్

దేవరకొండ : కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నేటి (బుధవారం) నుంచి జరగనున్న యువజన కాంగ్రెస్ జాతీయ యూత్ కన్వెన్షన్ సదస్సుకు మండలంలోని మైనంపల్లి ఎంపీటీసీ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర గౌతమిరాంసింగ్ హాజరుకానున్నారు. ఈ సమావేశంలో భారత దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.